

పదిలో నూరుశాతం ఉత్తీర్ణతకు ప్రత్యేక ప్రణాళిక

డివైఇఒ రవీంద్రభారతి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

పదో తరగతి పరీక్షల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక ప్రణాళిక అమలు చేస్తున్నట్లు డివెఇఒ రవీంద్రభారతి తెలిపారు. గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ప్రతిరోజూ ఉదయం ఒక గంట, సాయంత్రం ఒక గంట అదనంగా ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నట్లు చెప్పారు. సి, డి గ్రేడ్ విద్యార్థులు ఉత్తీర్ణులయ్యే విధంగా ప్రణాళిక రూపొందించి, వారిని చదివించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనని తెలిపారు. ఎ, బి గ్రేడ్ విద్యార్థులు ఎక్కువ మార్కులు సాధించేలా చదివించడం, ప్రతి విద్యార్థీ ఉత్తీర్ణులయ్యేలా ఉపాధ్యాయులు బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంఇఒ పి.జ్యోతి, పెంటపాడు ఎంఇఒ టివి.రామకృష్ణ, జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎం.సత్యనారాయణ పాల్గొన్నారు.



ఖరీఫ్

పంటపై రైతుల్లో ఆందోళన

కళ్లాల్లో ధాన్యం ఆరబెట్టే పనిలో రైతులు

రెండు జిల్లాల్లో సగం మాసూళ్లూ పూర్తికాని పరిస్థితి

ఏదైనా తేడా వస్తే తీవ్రంగా నష్టపోనున్న అన్నదాత

అన్నదాత గుండెల్లో తుపాను

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

అన్నదాత గుండెల్లో తుపాను రేగుతోంది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తుపానుగా మారనున్నట్లు వాతావరణశాఖ హెచ్చరికలు రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఖరీఫ్ పంట గట్టెక్కుతుందా అనే బెంగ కర్షకులను వెంటాడుతోంది. రెండు జిల్లాల్లోనూ ఇంకా సగానికిపైగా ఖరీఫ్ మాసూళ్లు పూర్తి కాకపోవడంతో రైతులకు దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల వ్యాప్తంగా ఖరీఫ్‌లో దాదాపు నాలుగు లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగు చేశారు. గడిచిన పది రోజులుగా ఖరీఫ్ మాసూళ్లు కొనసాగుతున్నాయి. తాడేపల్లిగూడెం, పెంటపాడు, ఉంగుటూరు వంటి మండలాల్లో అత్యధికంగా మాసూళ్లు పూర్తయినప్పటికీ మిగిలిన మండలాల్లో సగం మాసూళ్లు కూడా పూర్తికాని పరిస్థితి ఉంది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తుపానుగా మారనుందని, రాష్ట్రంపై తీవ్ర ప్రభావం చూపనుందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. డిసెంబర్ నాలుగు నుంచి ఆరో తేదీ వరకూ వర్షాలు కురవనున్నట్లు పేర్కొంది. ఇప్పటికే వాతావరణంలో మార్పులు చోటు చేసుకున్నాయి. మబ్బులు, చినుకులతో వాతావరణం భయ పెడుతోంది. వాతావరణంలో చోటుచేసుకున్న మార్పులతో రైతులకు ఏం చేయాలో అర్థంకాని పరిస్థితి నెలకొంది. యంత్రాల ద్వారా కోతలు కోస్తుండటంతో ధాన్యం ఆరబెట్టాల్సిన పరిస్థితి ఉంది. వాతా వరణం సరిగా లేకపోవడంతో ధాన్యం ఆరడానికి కనీసం ఐదు రోజులకుపైగా పడుతోంది. మబ్బులుగా ఉండటంతో ధాన్యం తొందరగా ఆరడం లేదు. ఒకపక్క తుపాను హెచ్చరికలు, మరోపక్క కళ్లాల్లో ధాన్యం చూసి రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో వర్షాలు కురిస్తే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. ఎకరాకు రూ.30 వేలకుపైగా రైతులు పెట్టుబడి పెట్టారు. మూడెకరాలు సాగు చేసిన రైతు కనీసంగా రూ.లక్ష వరకూ పెట్టుబడి పెట్టిన పరిస్థితి ఉంది. జిల్లాలో మూడొంతులు మంది కౌలురైతులే వరిసాగులో ఉన్నారు. వీరికి బ్యాంకులు ఎటువంటి రుణాలూ ఇవ్వలేదు. దీంతో ప్రయివేటు వడ్డీ వ్యాపారుల నుంచి అధిక వడ్డీలకు అప్పు తెచ్చి పెట్టుబడులు పెట్టారు. పంట సక్రమంగా చేతికొస్తే రబీ పెట్టుబడులకు ఇబ్బంది ఉండదని ఎన్నో ఆశలు పెట్టు కున్నారు. పంట చేతికొచ్చే సమయంలో వెంటాడుతున్న ప్రకృతి వైప రీత్యాలతో రైతులు నలిగిపోతున్నారు. తుపాను హెచ్చరికలతో పంట చేతికొస్తుందో, లేదోననే భయం అన్నదాతకు నిద్ర లేకుండా చేస్తోంది. ఏదైనా తేడా వస్తే కౌలురైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది.

ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటేనే అన్నదాతకు న్యాయం

రెండు జిల్లాల్లోనూ ఒకటి, రెండు మండలాల్లో తప్ప మాసూళ్లు చేసిన ధాన్యం అంతా కళ్లాల్లోనే ఉంది. ఎక్కడ చూసినా ధాన్యం ఆరబెట్టే దృశ్యాలే కన్పిస్తున్నాయి. ఇప్పటి వరకూ ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు చేసిన ధాన్యం సైతం నామమాత్రంగానే ఉంది. వాతావరణం మబ్బుగా ఉండటంతో ధాన్యం సరిగా ఆరడం లేదు. ఆరబెట్టిన ధాన్యం వెంటనే కొనుగోలు చేసేలా అధికారులు ఎక్కడికక్కడే చర్యలు తీసుకోవాలి. ధాన్యం కొనుగోలులో రైతులకు ఎటువంటి ఇబ్బందీ లేకుండా చూడాలి. తేమశాతంలో మిల్లర్ల నుంచి వచ్చే ఇబ్బందులను పరిష్కరించాలి. అప్పుడే రైతులకు న్యాయం జరిగే పరిస్థితి ఉంటుంది. ధాన్యం కొనుగోలులో శ్రద్ధ తీసుకుంటేనే రైతులను విపత్తు నుంచి బయటపడే అవకాశం ఉంటుంది. ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుంది.

పకడ్బందీగా సిఎం పర్యటనా ఏర్పాట్లు

బైపాస్ రోడ్‌లో సభా వేదిక

లూథరన్ హైస్కూల్ ప్రాంగణంలో హెలీప్యాడ్ ఏర్పాటు

సమీక్షించిన గ్రంధి, కలెక్టర్, ఎస్‌పి, సిఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్

ప్రజాశక్తి - భీమవరం

భీమవరంలో డిసెంబర్ 8న సిఎం జగన్ పర్యటనా ఏర్పాట్లను కలెక్టర్ ప్రశాంతి, ప్రభుత్వ విప్ గ్రంధి శ్రీనివాస్, ముఖ్యమంత్రి ప్రోగ్రాం కోఆర్డినేటర్, ఎంఎల్‌సి తలశిల రఘురాం, జిల్లా ఎస్‌పి యు.రవిప్రకాష్ గురువారం సంయుక్తంగా పరిశీలించారు. హెలీప్యాడ్ ఏర్పాటుకు తొలుత విష్ణు కళాశాల సమీపంలోని మారుతి షోరూమ్ వద్ద లేఅవుట్‌ను పరిశీలించిన సంగతి తెలిసిందే. అయితే తాజాగా హెలీప్యాడ్‌ను లూథరన్ హైస్కూల్ ప్రాంగణంలో ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. సభా వేదికను బైపాస్ రోడ్డులోని గ్రంధి వెంకటేశ్వరరావు జూనియర్ కళాశాల వెనుక లేఅవుట్‌లో ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అనంతరం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో జిల్లా అధికారులతో వారు సిఎం పర్యటనా ఏర్పాట్లను సమీక్షించారు. హెలీప్యాడ్ నిర్మాణం, పటిష్టమైన బారికేడింగ్ ఏర్పాటు ఆర్అండ్‌బి అధికారులు చేపట్టాలన్నారు. అలాగే హెలీప్యాడ్, సభా వేదిక వద్ద అంతర్గత రోడ్ల నిర్మాణం చేపట్టాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ప్రశాంతి, ఎస్‌పి రవిప్రకాష్ సంయుక్తంగా ముఖ్యమంత్రి పర్యటన రూట్‌లో ట్రయల్ రన్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజు, డిఆర్‌ఒ బి.శివన్నారాయణరెడ్డి, ఆర్‌డిఒ కె.శ్రీనివాసులురాజు, జిల్లా వార్డు, సచివాలయాల అధికారి కెసిహెచ్.అప్పారావు, ఆర్అండ్‌బి జిల్లా అధికారి బి.లోకేశ్వరరావు, కమిషనర్ ఎం.శ్యామల, జిల్లా అగ్నిమాపకదళ అధికారి బి.శ్రీనివాసరావు, జిల్లా ట్రాన్స్‌పోర్టు అధికారి టి.ఉమామహేశ్వరరావు, జిల్లా సర్వే అధికారి కె.జాషువా, డిఎఫ్‌ఒ డి.ఎ.కిరణ్, విద్యుత్ శాఖ ఇఇ ఫీర్ అహ్మద్‌ఖాన్, ఎపీడీ వి.విజయలక్ష్మి, డిఎస్‌పి బి.శ్రీనాథ్, భీమవరం తహశీల్దార్ వై.రవికుమార్ పాల్గొన్నారు.



రూట్‌మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి, ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్, అధికారులు

సిఎం సభ విజయవంతానికి విస్తృత ఏర్పాట్లు

భీమవరం రూరల్: పట్టణంలో డిసెంబర్ 8న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సభను విజయవంతం చేయడానికి విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ తెలిపారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రోగ్రాం కోఆర్డినేటర్, ఎంఎల్‌సి తలశిల రఘురాం గురువారం స్థానిక ఎంఎల్ఎ క్యాంప్ కార్యాలయంలో గ్రంధిని కలిసి సిఎం పర్యటనా ఏర్పాట్లపై చర్చించారు. ఈ సందర్భంగా గ్రంధి మాట్లాడుతూ విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజు రీయంబర్స్‌మెంట్‌కు సంబంధించి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి విద్యా దీవెన పథకం నిధులను భీమవరం సభ నుంచి విడుదల చేస్తారన్నారు. ఈ బృహత్తర కార్యక్రమం భీమవరంలో జరగడం జిల్లా ప్రజల, విద్యార్థుల అదృష్టంగా భావిస్తున్నామన్నారు. భీమవరంలో జరిగే భారీ బహిరంగ సభను ప్రతిఒక్కరూ విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ప్రతిభాపాటవాల వెలికితీతకు బాలోత్సవాలు దోహదం

ఉపాధ్యాయ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ - తణుకు బాలోత్సవాల బ్రోచర్, పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - తణుకురూరల్

విద్యార్థినీ, విద్యార్థుల్లో ప్రతిభాపాటవాలను వెలికి తీసేందుకు బాలోత్సవాలు దోహదం చేస్తాయని ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ అన్నారు. గురువారం శ్రీశ్రీ సేవా విజ్ఞాన కేంద్రంలో జరిగిన సమావేశంలో బాలోత్సవాల బ్రోచర్‌ను, పోస్టర్‌ను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా సాబ్జీ మాట్లాడుతూ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పిల్లలను ప్రోత్సహించాలని కోరారు. ప్రయివేటు పాఠశాలల అసోసియేషన్ (అపుస్మా) తణుకు జోన్ అధ్యక్షులు పెన్మెత్స రామరాజు మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న అభిరుచులను, సృజనాత్మకతను, జ్ఞానతృష్ణను, ఆసక్తిని ప్రోత్సహించడానికి, ఒకే వేదిక మీద వారి ప్రతిభాపాటవాలను ప్రదర్శించడానికి తణుకు బాలోత్సవాలు నిర్వహిస్తున్నారన్నారు. వ్యాసరచన, వక్తృత్వం, స్పెల్‌బి, క్విజ్, మెమరీ టెస్ట్, చిత్రలేఖనం వంటి అకడమిక్ అంశాలు, దేశభక్తి, అభ్యుదయ గీతాలాపన, శాస్త్రీయనృత్యం, కోలాటం తదితర సాంస్కృతిక అంశాల్లో ఈ ప్రదర్శనలు జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అపుస్మా తణుకు శాఖ కార్యదర్శి రాజశేఖర్, కోశాధికారి నగేష్, రాష్ట్ర కమిటీ సభ్యులు విద్యాకాంత్, పలు పాఠశాలల యాజమాన్య ప్రతినిధులు, శ్రీశ్రీ సేవావిజ్ఞాన కేంద్రం బాధ్యులు, బాలోత్సవం ప్రధాన కార్యదర్శి పి.దక్షిణామూర్తి, ఆర్గనైజింగ్ కార్యదర్శి పిఎల్.నరసింహారావు, ప్రగతి విద్యా సంస్థల డైరెక్టర్ ప్రగతి రాజా పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరించిన నేతలు



నినదిస్తున్న సిపిఎం నేతలు, కార్యకర్తలు

ఇజ్రాయిల్‌కు మద్దతును నిరసిస్తూ సిపిఎం ధర్నా

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

పాలస్తీనా భూభాగాన్ని ఆక్రమించిన ఇజ్రాయిల్‌కు మన దేశ పాలకులు మద్దతివ్వడం సిగ్గుచేటని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కర్రి నాగేశ్వరరావు విమర్శించారు. ఆ పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో గురువారం స్థానిక పోలీసు ఐల్యాండ్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పాలస్తీనాపై ఇజ్రాయిల్ యుద్ధం ఆపాలని, యుద్ధం వద్దు.. శాంతి ముద్దు, నశించాలి.. అమెరికన్ సామ్రాజ్యవాదం అని పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ పాలస్తీనా జాతిని నిర్మూలించే దిశగా అమెరికా ఆదేశాలకు అనుగుణంగా ఇజ్రాయెల్ నడుస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయిల్, చమురు ఉన్న అరబ్ దేశాలపై పెత్తనం చేయడానికే పాలస్తీనాని నాశనం చేస్తున్నారన్నారు. పాలస్తీనాకు రక్షణ కల్పించాల్సిన ఐక్యరాజ్య సమితి ప్రేక్షకుడిలా మారిపోవడం బాధాకరమన్నారు. పాలస్తీనా ప్రజలకు యుద్ధం వల్ల ఆహారం, తాగునీరు, కరెంట్, ఇంటర్‌నెట్, వైద్యం వంటివి అందడం లేదని వారు తెలిపారు. భారత్‌లో గత ప్రభుత్వాలు పాలస్తీనాకు మద్దతుగా నిలిచాయని గుర్తు చేశారు. కార్యక్రమానికి సిపిఎం నాయకులు కరెడ్ల రామకృష్ణ, జవ్వాది శ్రీను, గొన్నాబత్తుల నాగేశ్వరరావు, శిద్దిరెడ్డి శేషబాబు, యడవల్లి వెంకట దుర్గారావు, మేట్రెడ్డి రమణ, నర్మాల నారాయణరావు, అడపా లోవ, రోకళ్ల లోవరాజు తదితరులు నాయకత్వం వహించారు.

అంగన్వాడీల పట్ల నిర్లక్ష్యం వీడాలి

అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఝాన్సీ, కళ్యాణి

ప్రజాశక్తి - భీమవరం

అంగన్వాడీల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి వీడాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె.ఝాన్సీ, జిల్లా కార్యదర్శి డి.కళ్యాణి అన్నారు. డిసెంబరు 8వ తేదీ నుండి అంగన్వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మెకు మద్దతు కోరుతూ స్థానిక సిఐటియు కార్యాలయంలో గురువారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 48 ఏళ్ల నుండి ఇప్పటి వరకు గ్రామీణ, పట్టణ మురికివాడల్లో నివశించే పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన బాలింతలు, గర్భవతులు, ఆరేళ్లలోపు పిల్లలకు సేవలు, ప్రభుత్వ నిర్దేశిత ఉద్దేశాలను నెరవేర్చే దిశలో అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు అతి తక్కువ గౌరవ వేతనాలతో వెట్టిచాకిరీ చేస్తున్నారన్నారు. నిరంతరం పెరుగుతున్న ధరలు, చాలీచాలని జీతాలతో జీవనం గడపడం కష్టతరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్వాడీ కేంద్రాలకు ప్రభుత్వం బిల్లులు సైతం చెల్లించకపోవడం వల్ల అదనపు భారాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. తెలంగాణ కంటే అదనంగా రూ.వెయ్యి వేతనం ఇస్తానన్న సిఎం జగన్ హామీ సైతం అమలుకు నోచుకోలేదని ఆందోళన వ్యక్తం చేశారు. వివిధ రకాల మొబైల్ యాప్స్‌తో పని భారం పెంచి మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నారన్నారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జిల్లా అధికారులకు, రాష్ట్ర ప్రభుత్వానికి అనేకసార్లు తెలియజేస్తున్నా నిర్లక్ష్య ధోరణి వీడటం లేదని వాపోయారు. అనివార్య పరిస్థితుల్లో డిసెంబర్ 8 నుండి నిరవధిక సమ్మె చేపట్టామని తెలిపారు. రౌండ్‌టేబుల్ సమావేశంలో మెడికల్ రిప్రజెంటేటివ్ నాయకులు శిరీష్‌కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు జక్కంశెట్టి సత్యనారాయణ, రైతుసంఘం నాయకులు వెంకటేశ్వరరావు, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి కె.క్రాంతిబాబు, ఐద్వా జిల్లా నాయకులు సరోజిని, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు వరలక్ష్మి, మునియ్య పాల్గొని తమ సంఘాల తరపున అంగన్వాడీల సమ్మెకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్, జిల్లా ఉపాధ్యక్షులు బి.వాసుదేవరావు మాట్లాడుతూ సిఐటియు అంగన్వాడీల పోరాటానికి వెన్నుదన్నుగా ఉంటుందన్నారు.



మాట్లాడుతున్న ఝాన్సీ, హాజరైన వివిధ సంఘాల నేతలు

ఓటర్ల జాబితాలో అవకతవకలపై టిడిపి ధర్నా

ప్రజాశక్తి - తణుకురూరల్

రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. గురువారం ఓటర్ల జాబితాలోని అవకతవకలను పరిశీలించాలని కోరుతూ స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద గురు వారం ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ పిఎన్‌డి.ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో అధికార పార్టీ వైసిపి అవకతవకలు చూస్తున్నామని, దొంగ ఓట్లు ఎక్కువగా చేర్పించాలని ప్రయత్నిస్తున్నారని అన్నారు. ప్రతిపక్ష పార్టీలకు చెందిన వారి ఓట్లను తొలగిస్తున్నారని ఆరోపించారు. ఈ ప్రయత్నాలను అంతా తిప్పికొట్టాలన్నారు. ప్రజలంతా తమ ఓట్లను ఎప్పటికప్పుడు పరిశీలించుకుంటూ జాబితాలో ఉందా లేదా అనేది తెలుసుకోవాలన్నారు. 18 సంవత్సరాలు దాటిన వారందరికీ మరో వారం రోజులు సమయం ఉందని, దానిని కూడా ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఒమ్మి రాంబాబు, తాతపూడి మారుతీరావు, బట్టవల్లి నాగరాజు, బోళ్ల శ్రీను, శివ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందిస్తున్న ఆరిమల్లి రాధాకృష్ణ, నేతలు

జనవరిలోగా ఇళ్ల నిర్మాణం చేపట్టాలి

ఛైర్‌పర్సన్ శ్రీవెంకటరమణ

ప్రజాశక్తి - నరసాపురంటౌన్

జగనన్న కాలనీల్లో ఇంటి స్థలం మంజూరైన లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాన్ని త్వరితగతిన చేపట్టేలా చైతన్యపర్చాలని మున్సిపల్ ఛైర్‌పర్సన్ బర్రి శ్రీ వెంకటరమణ జయరాజు అన్నారు. గురువారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాలులో జరిగిన సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. ఇంటి స్థలం మంజూరైన లబ్ధిదారులు లెవెలింగ్ పూర్తయిన ఇంటి స్థలంలో వచ్చే ఏడాది జనవరి నాటికి ఇల్లు నిర్మించుకునేలా కావాల్సిన రుణాన్ని స్వయం సహాయక గ్రూపుల ద్వారా పొందేలా కృషి చేయాలన్నారు. తహశీల్దార్ ఫాజిల్, కమిషనర్ డాక్టర్ కెవి.రావు ఇళ్ల నిర్మాణం చేపట్టేందుకు లబ్ధిదారులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరించారు. 15 ఏళ్లు పైబడిన బాలబాలికలు 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీలకు పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

పిఎం విశ్వకర్మ యోజన శిక్షణ కేంద్రాలను సిద్ధం చేయాలి

కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం


పిఎం విశ్వకర్మ యోజన లబ్ధిదారుల శిక్షణ కేంద్రాలను ఎంపిక చేసి సిద్ధంగా ఉండాలని కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ పిఎం విశ్వకర్మ యోజనపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. భీమవరం డిఎన్ఆర్ కళాశాల, ఉండి ఐటిఐ, తాడేపల్లిగూడెం పాలిటెక్నిక్, తణుకు ఎస్‌సిఐఎన్ డిగ్రీ కళాశాల, నరసాపురం లేస్‌పార్క్, పిఎం లంక స్కిల్ హబ్‌లను సిద్ధం చేయాలన్నారు. సంబంధిత కళాశాలల ప్రిన్సిపాళ్లను నోడల్ అధికారిగా నియమిస్తున్నట్లు వివరించారు. జిల్లాలో ఇప్పటి వరకు 26,751 దరఖాస్తులు వచ్చాయని, 20,845 దరఖాస్తులు మొదటి దశ పరిశీలన పూర్తయ్యిందని అన్నారు. గ్రామ పంచాయతీస్థాయిలో 4,065, మున్సిపాలిటీ స్థాయిలో 1,841 పరిశీలనకు పెండింగులో ఉన్నాయని తెలిపారు. సమావేశంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కృష్ణారెడ్డి, లీడ్‌బ్యాంకు జిల్లా మేనేజర్ నాగేంద్రప్రసాద్, జిల్లా గ్రామ వార్డు సచివాలయాల అధికారి కెసిహెచ్.అప్పారావు, జిల్లా పంచాయతీ అధికారి జివికె.మల్లికార్జునరావు, డ్వామా ఎఒ శివప్రసాద్‌యాదవ్, జిల్లా కార్మిక శాఖాధికారి ఎ.లక్ష్మి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఇంటింటికీ నిత్యావసరాల విక్రయం అభినందనీయం

ఎంఎల్ఎ గ్రంధి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

సహకార సొసైటీ ద్వారా ఇంటింటికీ నిత్యావసర సరుకుల విక్రయానికి వెంప సొసైటీ త్రిసభ్య కమిటీ కృషి అభినందనీయమని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. నాబార్డు సహకారంతో ఏర్పాటు చేసిన ఇంటింటికీ నిత్యావసర సరుకుల విక్రయ వాహనాన్ని గురువారం సాయంత్రం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఆయన ప్రారంభించి మాట్లాడారు. సహకార సంఘాలు రైతుల సహకారంతో మరింతగా అభివృద్ధి చెంది ప్రజలకు మేలు చేసేలా పని చేయాలని ఆయన కోరారు. వెంప సొసైటీ త్రిసభ్య కమిటీ ఛైర్మన్ కలిదిండి మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ ప్రజలకు నిత్యావసర సరుకులను మార్కెట్ కంటే తక్కువ ధరకే అందించాలనే లక్ష్యంతో ఎంఎల్ఎ గ్రంధి సహకారంతో ఈ నూతన విధానానికి శ్రీకారం చుట్టామన్నారు. ఇప్పటికే వెంపలో సొసైటీ ఆధ్వర్యంలో విజయవంతంగా సూపర్ మార్కెట్‌ను నడుపుతున్నామన్నారు. తమ సొసైటీ పరిధిలో సోమవారం శేరేపాలెం, కొత్తపాలెం, పాతూరు, మంగళవారం పెదగరువు, దిరుసుమర్రు, బుధవారం ముత్యాలపల్లి, వారతిప్ప, గురువారం శ్రీరామపురం, ఏకోదిబ్బ, శుక్రవారం వెంప గ్రామాల్లో ప్రజలకు ఈ మొబైల్ వ్యాన్‌ను అందుబాటులో ఉంచుతామన్నారు. అంతేకాకుండా వివాహాలు, ఇతర శుభకార్యాలకు రూ.10 వేలు విలువైన నిత్యావసర సరుకులను కొనుగోలు చేస్తే వారికి ఉచితంగా సరుకులను డోర్ డెలివరీ చేస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపిల సంఘం జిల్లా అధ్యక్షులు పేరిచర్ల విజయ నరసింహారాజు, ఎఎంసి మాజీ ఛైర్మన్ తిరుమాని ఏడుకొండలు, వెంప గ్రామాభివృద్ధి కమిటీ కన్వీనర్ అల్లూరి కృష్ణంరాజు, దాట్ల శ్రీనివాసరాజు, ఫణి రాజు, త్రిసభ్య కమిటీ సభ్యులు సానబోయిన త్రిమూర్తులు, పాలపర్తి కుటుంబరావు తదితరులు పాల్గొన్నారు.



మొబైల్ వ్యాన్‌ను ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్

తాగునీటి సమస్య పరిష్కారానికి అధిక ప్రాధాన్యత

ఎంఎల్ఎ వాసుబాబు

ప్రజాశక్తి - గణపవరం

నియోజకవర్గంలో తాగునీటి సమస్య పరిష్కారానికి అధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు ఉంగుటూరు ఎంఎల్ఎ పుప్పాల శ్రీనివాసరావు (వాసుబాబు) అన్నారు. గురువారం వెంకటరాజపురంలో రూ.15 లక్షలతో ముప్పర్తిపాడులో రూ.50 లక్షలు జలజీవన్ నిధులతో నిర్మించిన తాగునీటి ట్యాంకు, సంపు, పైపులైన్లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వాసుబాబు మాట్లాడుతూ తమ ప్రభుత్వం తాగునీటి సమస్య పరిష్కారానికి అధిక ప్రాధాన్యతనిస్తుందన్నారు. తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడకుండా నియోజకవర్గంలో అన్ని గ్రామాల్లో తాగునీటి ఓవర్‌హెడ్ ట్యాంకులు నిర్మించి ప్రతి ఇంటికీ తాగునీరు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచులు మల్లంపల్లి సురేష్, కర్రి రాధశ్రీనివాస్, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ కె.హరినాధ్‌రాజు, వైసిపి నేతలు దండు రాము, కాకర శ్యామ్ పాల్గొన్నారు.



పైపులైన్‌ను ప్రారంభించిన ఎంఎల్ఎ వాసుబాబు

రూ.12 లక్షల వేతనంతో క్యాంపస్ ప్లేస్‌మెంట్

ఎస్ఆర్‌కెఆర్ విద్యార్థినుల ఘనత

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థ ఐబిఎం నిర్వహించిన క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో ఏడాదికి రూ.12 లక్షల వేతనంతో తమ కళాశాల కంప్యూటర్ సైన్స్ అండ్ బిజినెస్ సిస్టమ్స్ (సిఎస్‌బిఎస్) ఫైనలియర్ ఇంజినీరింగ్ విద్యార్థినులు సాత్విక, మద్దుల కీర్తన ఎంపికైనట్లు ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కెవి.మురళీకృష్ణంరాజు చెప్పారు. గురువారం కళాశాల మేనేజ్‌మెంట్ మీటింగ్ హాల్లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ సాగి రామకృష్ణనిశాంత్‌వర్మ విద్యార్థినులను ఘనంగా సత్కరించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతిరాజు మాట్లాడుతూ ఐబిఎం జాతీయ స్థాయిలో నిర్వహించిన పోటీల్లో తమ విద్యార్థినులు అత్యున్నత ప్రతిభ ప్రదర్శించి అత్యధిక వేతనంతో ఉద్యోగాలు పొందారన్నారు. ఈ సందర్భంగా కళాశాల ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్ డీన్ డాక్టర్ కెఆర్.సత్యనారాయణ, సిఎస్‌సి హెడ్ డాక్టర్ వి.చంద్రశేఖర్, ఐటి డిపార్టుమెంట్ హెడ్ డాక్టర్ బిహెచ్‌విఎస్.రామకృష్ణంరాజు విద్యార్థినులను అభినందించారు.

మొగల్తూరు సొసైటీలో రికార్డుల తనిఖీ

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరు సహకార సంఘంలోని పలు రికార్డులను సహకార శాఖ డిఆర్ రామదాసు గురువారం తనిఖీ చేశారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో సంఘంలో నిర్వహించిన ఆడిట్ నివేదికలో సంఘ పరిధిలో పలు చెల్లింపులు నిబంధనలకు విరుద్ధంగా జరిగాయని, కొందరు రైతులకు వడ్డీ రాయితీ ఇచ్చినట్లు గుర్తించారు. దీంతో పూర్తిస్థాయిలో దర్యాప్తు కోసం 51ఎ విచారణ నిర్వహించాలని సూచించడంతో విచారణ ప్రారంభించారు.


జయరామ కృష్ణంరాజుతో కేక్‌కట్ చేయిస్తున్న పివిఎల్ నరసింహరాజు

ఘనంగా జయరామ కృష్ణంరాజు పుట్టినరోజు

ప్రజాశక్తి - కాళ్ల

కోపల్లె సొసైటీ త్రిసభ్య కమిటీ ఛైర్మన్, వైసిపి పెదఅమిరం గ్రామ అధ్యక్షులు వేగేశ్న జయరామకృష్ణంరాజు పుట్టినరోజు వేడుకలు ఏలూరుపాడులో గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఏలూరుపాడులో రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచి భూపతిరాజు జగ్గరాజు ఆధ్వర్యంలో వేగేశ్న జయరామ కష్ణంరాజుతో కేక్‌కట్ చేయించారు. డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు, ఎంపిపి శిరీష విశ్వనాధరాజు, ఎంపిటిసి చిన్నాపరపు రాంబాబు, వైసిపి మండల కన్వీనర్ గణేశ్న రాంబాబు, ఆకివీడు ఎఎంసి డైరెక్టర్ పడమట సుబ్బయ్య, మంతెన రామకృష్ణంరాజు, ఆదియ్య, కొనా రంజిత్, వైసిపి కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

తాడేపల్లిగూడెం:తాడేపల్లిగూడెం మలేరియా సబ్ యూనిట్ అధికారి యేలూరి వెంకట లక్ష్మణరావు నేతృత్వంలోని వైద్యుల బృందం గురువారం ప్రధానంగా పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన, ఫీవర్ సర్వే, డ్రైడే ఫ్రైడే కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ దోమలు వృద్ధి చెందకుండా ప్రజలు తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు ఇచ్చారు. పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. డబ్బాలు, టైర్లు, కొబ్బరి బొండాలు, పనికిరాని చెత్తాచెదారాలు లేకుండా చూసుకోవాలన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వార్డు ఆరోగ్య కార్యకర్తలు వెంకటలక్ష్మి, ఆరోగ్య సహాయకులు కాంతారావు, వాలంటీర్లు పాల్గొన్నారు.

టిడిపి బూత్ కమిటీ సభ్యులకు సత్కారం

పాలకొల్లు :పాలకొల్లు నియోజకవర్గంలో ఇంతవరకూ 55 శాతం ఇళ్లను టిడిపి బూత్ కమిటీ సభ్యులు సందర్శించారని, ప్రతిచోటా టిడిపికి మంచి ఆదరణ లభిస్తోందని ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు చెప్పారు. తన క్యాంపు కార్యాలయంలో నూరు శాతం కార్యక్రమాన్ని పూర్తిచేసిన బూత్ కమిటీ సభ్యులను గురువారం ఎంఎల్ఎ ఘనంగా సత్కరించారు. నియోజకవర్గంలో 69 వేల కుటుంబాలు ఉంటే ఇంతవరకు 39,200 కుటుంబాలను సందర్శించి వారికి భవిష్యత్తు గ్యారంటీ బాండ్ పత్రాలను అందజేశారు.

విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేత

ఆచంట:రాష్ట్ర ప్రభుత్వం విద్యా విధానంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిందని, ఆ విధానాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్షులు సుంకర సీతారామ్ అన్నారు. కొడమంచిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం వికలాంగ విద్యార్థులకు రూ.లక్ష విలువ చేసే ట్యాబ్‌లను సీతారామ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొడమంచిలి హైస్కూల్లో వికలాంగులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి నాడు - నేడు ద్వారా జగనన్న అనేక పథకాలు ప్రవేశపెట్టారని తెలిపారు. ప్రభుత్వం విద్యార్థులకు అందించిన ట్యాబ్‌ల ద్వారా ఆన్‌లైన్ క్లాసులు వినడానికి ఎంతో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో స్కూల్ ఛైర్మన్ బొరుసు రాంబాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.రామకృష్ణ, ఉపాధ్యాయులు దానేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఎస్ఐ


మైక్ ప్రచారం చేస్తున్న పోలీసులు

పెనుగొండ:ప్రస్తుతం దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పెనుగొండ పోలీస్ సిబ్బంది గురువారం మైక్ ప్రచారం చేశారు. మండలంలోని 14 గ్రామాల్లో ఆటోపై మైక్ ద్వారా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రమేష్ మాట్లాడారు. ఒంటరి మహిళలు, వృద్ధులు ఉన్న ఇళ్లపై నేరస్తుల దృష్టి పెట్టే అవకాశం ఉందని తెలిపారు. అపరిచిత వ్యక్తులు వచ్చినా, అనుమానాస్పదంగా ఎవరైనా సంచరించినా వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లినప్పుడు పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ప్రయాణాల్లో సైతం జాగ్రత్తగా ఉండాలని సూచించారు. మీ వస్తువులు అపహరణకు గురికాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కోడిపందేలదిబ్బ కాలనీకి తాగునీరందిస్తాం

ప్రజాశక్తి - పెనుగొండ

తమ కాలనీకి పది రోజులుగా వాటర్ ట్యాంకు రావడం లేదని, సమస్యను పరిష్కరించాలని కోడిపందేలదిబ్బ కాలనీ వాసులు ఎండిఒ శ్రీనివాస్ దొరకు వినతిపత్రం అందజేశారు. స్పందించిన పంచాయతీ సిబ్బంది గురువారం వెంటనే వాటర్ ట్యాంకుల ద్వారా తాగునీరు అందిస్తామని తెలిపారు.

మైనర్లు వాహనాలు నడపరాదు : సిఐ

పెనుగొండ:మైనర్లు వాహనాలు నడపరాదని సిఐ నాగేశ్వరరావు తెలిపారు. స్థానిక శ్రీచైతన్య పాఠశాలలో జరిగే 'స్మార్ట్ లివింగ్'లో భాగంగా 'రహదారిపై జాగ్రత్తలు' కార్యక్రమాన్ని ప్రధానోపాధ్యాయులు బి.సత్యనారాయణ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సిఐ జి.నాగేశ్వరరావు హాజరై మట్లాడారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. అనంతరం విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఎస్ఐ ఎస్.రమేష్ మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలు ద్విచక్ర వాహనంపై బయటకెళ్లేటప్పుడు హెల్మెట్ ధరించేలా చూసుకోవాలన్నారు. అనంతరం పాఠశాల నుంచి గాంధీ బొమ్మ సెంటర్ వరకూ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్థసారథి, రాజకుమార్, రామారావు, పాఠశాల వెంకటేశ్వరరావు, గణేశ్వరి, సాయి, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మోటార్ సైకిళ్ల చోరీ కేసులో ముగ్గురు అరెస్టు

తణుకురూరల్:మోటార్ సైకిళ్ల చోరీకి పాల్పడుతున్న ముగ్గురు నిందితులను ఇరగవరం పోలీసులు గురువారం అరెస్టు చేశారు. వారి నుంచి సుమారు రూ.7.50 లక్షల విలువైన 9 మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఇరగవరం పోలీస్ స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తాడేపల్లిగూడెం డిఎస్‌పి సి.శరత్‌రాజ్‌కుమార్ వివరాలు వెల్లడించారు. తణుకు మండలం దువ్వ గ్రామానికి చెందిన ఆశెట్టి నాగేష్, పెంటపాడు మండలం మీనవల్లూరు గ్రామానికి చెందిన ముదరబోయిన దుర్గారావు, ఆకివీడు మండలం కోళ్లపర్రు గ్రామానికి చెందిన తాడిపర్తి దుర్గారావు జల్సాలకు అలవాటు పడి దొంగతనాలను వృత్తిగా చేసుకున్నారని తెలిపారు. ఇటీవల ఇరగవరం, అత్తిలి, తణుకు రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలో వరుస మోటార్ సైకిళ్ల దొంగతనాలకు పాల్పడ్డారన్నారు. పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా ఇరగవరం మండలం ఏలేటిపాడు గ్రామ సెంటర్‌లో అనుమానాస్పదంగా సంచరిస్తున్న వీరిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి 9 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. కేసును చేధించడంలో సహకరించిన పోలీసు సిబ్బందికి డిఎస్‌పి శరత్‌రాజకుమార్ రివార్డులు అందజేశారు. ముద్దాయిలను అరెస్టు చేసిన తణుకు రూరల్ సిఐ సిహెచ్ ఆంజనేయులు, ఇరగవరం ఎస్ఐ డి.ఆదినారాయణ, పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్‌పి రవిప్రకాష్, డిఎస్‌పి శరత్‌రాజకుమార్ అభినందించారు.

ఫేస్‌బుక్ అకౌంట్ హ్యాక్ అయ్యిందంటూ..

మాజీ మంత్రి సుజాత ఫిర్యాదు

వీరవాసరం:తన ఫేస్ బుక్ అకౌంట్ హ్యాక్ అయ్యిందంటూ మాజీ మంత్రి పీతల సుజాత గురువారం వీరవాసరం పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు. ఐటి యాక్ట్ 66 సి, 67 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు


మాట్లాడుతున్న ప్రభుత్వ చీఫ్‌విప్ ప్రసాదరాజు

ప్రజాశక్తి - మొగల్తూరు

అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం నుంచి సంక్షేమాభివృద్ధి ఫలాలు అందుతున్నాయని ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. కొత్తపాలెంలో సచివాలయం వద్ద గురువారం వై ఎపి నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వైసిపి పాలనను ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయన్నారు. నాలుగున్నర సంవత్సరాల కాలంలో గ్రామంలో జరిగిన రూ.30.77 కోట్ల అభివృద్ధి సంక్షేమ పథకాల ప్రగతిని తెలిపే డిస్ప్లే బోర్డును ఆయన ప్రారంభించారు. ముందుగా పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. కొత్తపాలెం గ్రామంలోని ప్రజలకు శుద్ధి జలాలు అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామని ప్రసాదరాజు తెలిపారు. గ్రామంలోని తాగునీటి చెరువు అభివృద్ధికి రూ.82.50 లక్షల నిధులు మంజూరు చేశామన్నారు. అనంతరం పైపులైన్లు, మైక్రో ఫిల్టర్, సంపు, జలజీవన్ మిషన్ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి కైలా సుబ్బారావు, సర్పంచి లోకం నాగలక్ష్మి నాని, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

నరసాపురం టౌన్ : పట్టణంలోని వలవలవారివీధి సచివాలయం వద్ద పురపాలక సంఘం పరిధిలో 9, 13, 14వ వార్డులకు సంబంధించి గురువారం జరిగిన వై ఎపి నీడ్స్ జగన్ కార్యక్రమానికి ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు పొందాలంటే జన్మభూమి కమిటీల ద్వారా ఎంపిక చేసిన వారికి మాత్రమే ఇచ్చేవారని, నేడు ఆ పరిస్థితి లేదని తెలిపారు. అనంతరం సంక్షేమ పథకాల ప్రగతి డిస్ప్లే బోర్డును ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్ పర్సన్ బర్రె శ్రీవెంకటరమణ, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు, భూసారపు జయప్రకాష్ పాల్గొన్నారు.

పాలకోడేరు:ఎన్నికలు సమీపిస్తున్న వేళ వాలంటీర్లు బాధ్యతతో పనిచేయాలని ఎంపిపి భూపతిరాజు సత్యనారాయణ రాజు (చంటిరాజు) అన్నారు. పెన్నాడ అగ్రహారంలో సర్పంచి చిల్లా అనూష సత్యనారాయణ ఆధ్వర్యంలో రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాల బోర్డును ఎంపిపి చంటి రాజు, వైసిపి జెండాను పార్టీ మండల అధ్యక్షులు కటిక శ్రీదేవి ఆవిష్కరించారు అనంతరం ఏర్పాటు చేసిన సభకు సర్పంచి అనూష సత్యనారాయణ అధ్యక్షత వహించగా ఎంపిపి చంటిరాజు మాట్లాడారు. కార్యక్రమంలో ఉప ఎంపిపిలు నరేష్, లక్ష్మీతులసి, సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు భూపతి రాజు వంశీకృష్ణంరాజు, బొల్ల శ్రీనివాస్, నాయకులు సుబ్రహ్మణ్యంరాజు పాల్గొన్నారు.

ఆచంట (పెనుమంట్ర) : రాష్ట్రానికి జగనన్న ఎందుకు రావాలి కార్యక్రమం నెగ్గిపూడి సర్పంచి మామిడిశెట్టి ధనలక్ష్మి అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధి కార్యక్రమాల ప్రచార సమాచార బోర్డు, పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎంపిటిసి పెనుగొండ లక్ష్మి ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి మండల కమిటీ ఛైర్మన్ కొవ్వూరి చిన్నారెడ్డి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ఆచంట : రాష్ట్ర ప్రజలందరి సంక్షేమ ఫలాలను అందిస్తున్న వ్యక్తి సిఎం జగన్మోహన్ రెడ్డి ఎఎంసి ఛైర్మన్ చిల్లే లావణ్య అన్నారు. గురువారం వల్లూరు గ్రామ పంచాయతీ 1వ సచివాలయ పరిధిలో రాష్ట్రానికి సిఎం జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. అనంతరం వల్లూరు 1వ సచివాలయ పరిధిలో లబ్ధి చేకూరిన నిధుల జాబితాను ఏర్పాటు చేసి, పార్టీ జెండాను ఎగరవేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సచివాలయ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం : ఎంఎల్ఎలు

ప్రజాశక్తి - పాలకొల్లు

టిడిపి, జనసేన కూటమి అమలు చేసే బాబు షూరిటీ, భవిష్యత్తు గ్యారంటీ పథకాలపై అన్ని వర్గాల ప్రజల్లో నమ్మకం ఏర్పడిందని ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు అన్నారు. భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా గురువారం పట్టణంలోని 15వ వార్డులో ఇంటింటికీ వెళ్లి బాండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడారు. పాలకొల్లు నియోజకవర్గంలో 69 వేల ఇళ్లు ఉండగా ఇప్పటివరకు 40 వేల ఇళ్లకు బాండ్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. టిడిపి, జనసేన కూటమి అధికారంలోకి వస్తే ప్రజలకు లబ్ధి చేకూరుతుందని మహిళలు ఎదురు చూస్తున్నారన్నారు. రాష్ట్రంలో జగన్ పాలన ఎప్పుడు పోతుందో చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌ల పాలన ఎంతతొందరగా వస్తుందోనని ఎదురుచూస్తున్నారని తెలిపారు.

పాలకోడేరు : రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని ఎంఎల్ఎ మంతెన రామరాజు అన్నారు. శృంగవృక్షం గ్రామంలో ఇంటింటా రాంబాబు, టిడిపి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ రామరాజు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేసి మాట్లాడారు

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఆచంట (పెనుమంట్ర):ఆలమూరు 33/11 కెవి సబ్‌స్టేషన్ పరిధిలో ఈ నెల ఒకటో తేదీన విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు నరసాపురం ట్రాన్స్ కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.సురేష్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సబ్ స్టేషన్ పరిధిలోని ఆలమూరు లోకల్, ఆలమూరు ఇండస్ట్రియల్, నెలమూరు ఫీడర్ పరిధిలోని ఆలమూరు, నెలమూరు, ఓడూరు గ్రామాల్లో చెట్ల కొమ్మలు తొలగించేందుకు ఉదయం 8 :00 గంటల నుంచి మధ్యాహ్నం 1:00 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఓటు హక్కు నమోదుపై అవగాహన

తాడేపల్లిగూడెం:అర్హత కలిగిన ప్రతి విద్యార్థీ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఎన్నికల అధికారి ఎ.దుర్గేష్ తెలిపారు. గురువారం శశి ఇంజినీరింగ్ కళాశాలలో ఓటరు నమోదుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు కొత్త ఓటరు కార్డు కోసం ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా ఓటు హక్కు నమోదు చేసుకోవాలన్నారు. ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ ఎన్ఎస్-ఎస్‌వి.ప్రసాద్ మాట్లాడుతూ ఓటు ద్వారా మంచి నేతను ఎన్నుకుంటే భవిషత్తు బాగుంటుందన్నారు. కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ మొహమ్మద్ ఇస్మాయిల్ మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి కృషి

ఆచంట: కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి తన వంతు కృషి చేస్తానని ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాధరాజు తెలిపారు. గురువారం పోడూరు మండలం తూర్పుపాలెం ఎంఎల్ఎ కార్యాలయంలో జక్కంశెట్టివారిపాలెం శెట్టిబలిజ సంఘం పెద్దలు మర్యాదపూర్వకంగా ఎంఎల్ఎను కలిసి కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి అధిక నిధులు కేటాయించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో అన్ని సామాజిక వర్గాలకూ సమన్యాయం చేసేవిధంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్షులు సుంకర సీతారామ్, ఎఎంసి డైరెక్టర్ జక్కంశెట్టి వెంకటేశ్వరరావు, పితాని గణపతి పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్రా'లో యువత పాల్గొనాలి : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - గణపవరం

ఈ నెల 15 నుంచి జనవరి 24వ తేదీ వరకూ ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా జరిగే ఆటల పోటీల్లో యువతీ యువకులు పాల్గొని జయప్రదం చేయాలని ఉంగుటూరు ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు అన్నారు. గురువారం తన క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర వణ్యప్రాణి కృష్ణజింక లోగోను ఆవిష్కరించి మాట్లాడారు. 15 సంవత్సరాల పైబడిన యువతీ యువకులు క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, షటిల్, బ్యాడ్మింటన్ క్రీడల్లో పాల్గొనవచ్చని తెలిపారు. ఈ పోటీలు గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిలో జరుగుతాయని చెప్పారు. నియోజకవర్గంలో ప్రథమ స్థానం సాధించిన టీంకు రూ.20,000, ద్వితీయ స్థానానికి రూ.10,000, జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన వారికి లక్ష రూపాయలు, ద్వితీయ స్థానం సాధించిన వారికి రూ.50,000, రాష్ట్రస్థాయి ప్రథమ స్థానం సాధించిన వారికి రూ.ఐదు లక్షలు, ద్వితీయ సాధించిన వారికి రూ.రెండున్నర లక్షలు బహుమతిగా ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు ఈనెల 15వ తేదీలోపు రిజిస్టర్ చేయించుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ జ్యోతిర్మయి, ఇఒపిఆర్‌డి పివి.సత్యనారాయణ పాల్గొన్నారు.

విద్యా కరదీపిక ఉపయోగకరం

ప్రజాశక్తి - కాళ్ల

పాఠశాల నిర్వహణకు అవసరమైన అన్ని విద్యా, విద్యాయేతర అంశాలతో రూపొందించిన విద్యా కరదీపిక ఎంతో ఉపయోగకరమని ఎంఇఒ-2 గాదిరాజు కనకరాజు అన్నారు. కోపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో ప్రాథమిక స్థాయి స్కూల్ కాంప్లెక్స్ శిక్షణ తరగతులు గురువారం నిర్వహించారు. పెదఅమిరం స్పెషల్ ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జిటిగా పనిచేస్తున్న గుదే సుబ్బారావు తయారుచేసిన విద్యావాణి ఉపాధ్యాయ నేస్తం కరదీపికను ఎంఇఒ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా సంబంధమైన అన్ని అంశాలను క్రోడీకరించి ఈ కరదీపిక తయారు చేయడం అభినందనీయమన్నారు. ఇటువంటి కరదీపికను తయారు చేయడం రాష్ట్ర విద్యాశాఖలోనే ప్రథమమన్నారు. ఈ కార్యక్రమంలో కోపల్లె హైస్కూల్ ప్రధానోపాధ్యాయిని కె.నిర్మలాదేవి, ఉపాధ్యాయులు కె.సుబ్బరాజు, ఐ.వరలక్ష్మి, సిఆర్‌పి పుష్పరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీల ధర్నా


ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

ప్రజాశక్తి - ఆకివీడు

తమకు తెలంగాణలో ఇచ్చే జీతాల కంటే ఆంధ్రప్రదేశ్‌లో అధిక జీతాలు ఇస్తానని పాదయాత్రలో ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి జగన్ నేటికీ అమలు చేయలేదంటూ అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు నిరసన తెలిపారు. ఈ మేరకు ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీలు శుక్రవారం సాయంత్రం స్థానిక ప్రాజెక్టు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ యూనియన్ సంఘం నాయకురాలు పైడేశ్వరి అధ్యక్షతన జరిగిన సభలో సిఐటియు మండల కార్యదర్శి కె.తవిటినాయుడు మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణకు కార్యకర్తలే పెట్టుబడులు పెట్టాల్సి వస్తోందన్నారు. రిటైర్మెంట్ వయసు 62కు పెంచాలన్నారు. కనీస వేతనం రూ.26 వేలు మంజూరు చేయాలన్నారు. సమస్యలు పరిష్కరించాలని 8వ తేదీ నుంచి అంగన్‌వాడీ కేంద్రాలను మూసివేసి నిరంతర సమ్మెకు కార్యకర్తలు దిగనున్నారని తెలిపారు. సమ్మెకు అందరూ మద్దతు తెలియజేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పైడేశ్వరి, కృష్ణకుమారి, పి.శివలక్ష్మి, కృష్ణవేణి, రమాకుమారి, సీతామహాలక్ష్మి, ఇందిరాదేవి, నోము పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పంచాయతీ శాఖ అధికారి జివికె.మల్లికార్జునరావు గురువారం మండలంలోని నాగిడిపాలెం గ్రామ పంచాయతీ వద్ద వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని గ్రామ పంచాయతీ సర్పంచి నాగిడి దుర్గా భవాని అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పంచాయతీ శాఖ అధికారి మాట్లాడుతూ జిల్లాలో కేంద్ర ప్రభుత్వం అమలు చేసే పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించే విధంగా ప్రతి గ్రామంలోనూ 'వికసిత్ భారత్ సంకల్ప యాత్ర' కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమం గురించి ప్రజలకు తెలియజేయడంతో పాటు ఆ పథకాల ప్రయోజనాన్ని పొందని అర్హులను గుర్తించి, వారికి అందిస్తామని తెలిపారు. ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలపై గ్రామ స్థాయిలోని ప్రజలకు అవగాహన కలిగించడం, తద్వారా ఆ సంక్షేమ ఫలాలను పొందిన లబ్ధిదారుల కలిసి వారు పొందిన లబ్ధిని తెలుసుకోవడం, ఆ గ్రామంలో ఇంకా ఎవరైనా లబ్ధి పొందని వారుంటే వారికి కూడా సంక్షేమ ఫలాలు పొందేలా చేయడమే ఉద్దేశమన్నారు. అనంతరం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర పోస్టర్లను జిల్లా పంచాయతీ శాఖ అధికారి ఆవిష్కరించి ప్రజలకు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా గృహ నిర్మాణశాఖ అధికారి డాక్టర్ ఆర్‌సి.ఆనందకుమార్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డి.మహేశ్వరరావు, డిఎస్ఒ ఎన్.సరోజ, జిల్లా ఐసిడిఎస్ అధికారి బి.సుజాతారాణి, ఎంపిడిఒ కె.వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

మున్సిపాల్టీ ప్రత్యేకాధికారిగా చెన్నయ్య

తాడేపల్లిగూడెం:మున్సిపాల్టీ స్పెషల్ ఆఫీసర్‌గా తాడేపల్లిగూడెం ఆర్‌డిఒ కె.చెన్నయ్యను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇంతవరకూ గూడెం మున్సిపల్ స్పెషలాఫీసర్‌గా జిల్లా జాయింట్ కలెక్టర్ ఉన్నారు. ప్రభుత్వం తాజాగా చెన్నయ్యకు మున్సిపాల్టీ స్పెషల్ ఆఫీసర్ బాధ్యతలు అప్పగించింది. నియమితులైన ఆర్‌డిఒ చెన్నయ్య మాట్లాడుతూ ప్రభుత్వం అప్పగించిన ఈ బాధ్యతను సమర్ధవంతంగా నిర్వహించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. మున్సిపల్ కమిషనర్, ఇతర విభాగాలు అధిపతులను సమన్వయం చేసుకొని మెరుగైన పాలన అందించేందుకు కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు.

సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణ

గణపవరం:మండలంలో సర్పంచులు, కార్యదర్శులు పరిపాలన తగు జాగ్రత్తలు తీసుకుని, ప్రజలకు సేవలందించాలని ఎంపిడిఒ జి.జ్యోతిర్మయి తెలిపారు. గురువారం ఎంపిడిఒ కార్యాలయంలో సర్పంచులకు, కార్యదర్శులకు ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఒకరోజు జరిగిన శిక్షణా కార్యక్రమంలో పంచాయతీ నిర్వహణ, స్వరూప స్వభావం, గ్రామ సభలు, పంచాయతీ ఆదాయం పన్నుల చెల్లింపులు తదితర అంశాలపై ఇఒపిఆర్‌డి పివి.సత్యనారాయణ వివరించారు. కార్యక్రమంలో సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.